

నేత్రపర్వంగా తిరుమలనాథ స్వామి రథోత్సవం

పెద్దారవీడు మండలంలోని తిరుమలనాథ స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది.

- 8లో..



రెండు కిలోల గంజాయి పట్టివేత

ఒడిశా నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న ముఠాను సెబ్ అధికారులు అరెస్టు చేశారు. రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
38/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలసిన బూచేపల్లి



కలెక్టర్‌ను సత్కరిస్తున్న బూచేపల్లి

ఒంగోలు అర్బన్ : ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.

ప్రకాశం భవనం ఆధునికీకరణ దాదాపు పూర్తి

- శిలాఫలకం ఆవిష్కరించిన కలెక్టర్ దినేష్‌కుమార్



ఆధునికీకరణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రకాశం భవనంలో ఎన్నికల ముందు చేపట్టిన ఆధునికీకరణ పనులు దాదాపుగా పూర్తయినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ప్రకాశం భవనం సెంటర్ ముఖద్వారం వద్ద పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. పరిపాలన కేంద్రమైన ప్రకాశం భవనంలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పాటు ఆధునికీకరణ పనులు చేపట్టారు. గ్రానైట్ ఫ్లోరింగ్, విద్యుత్ వైర్ల మార్పిడి, మెట్ల రైలింగ్, ల్యాండింగ్, రంగులు, కలెక్టరేట్ విభాగాల మరమ్మతులు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ శ్రీలత, ఏఈ భాస్కర్‌బాబు, ఎంఈ జాని, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్‌లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్జీటీ పోస్టుల సంఖ్య తేల్చాలి



మాట్లాడుతున్న కేవీ పిచ్చయ్య

దర్శి: జిల్లా విద్యాశాఖాధికారులు ఎస్జీటీ పోస్టుల సంఖ్యను తేల్చాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పిచ్చయ్య మాట్లాడుతూ డీవైఎఫ్ఐ పోరాట ఫలితంగా వచ్చిన మెగా డీఎస్సీ టీచర్ పోస్టులు పెంచకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. జిల్లాలో 1000 ఎస్జీటీ పోస్టులు భర్తీ చేసి వెంటనే మెగా డీఎస్సీ పరిధిలో చేర్చాలని కోరారు. కేవలం 124 పోస్టులను భర్తీ చేస్తున్నామని వివిధ పత్రికల్లో వార్తలు వస్తున్నాయన్నారు. జిల్లా అధికారులు దృష్టి సారించి లెక్కలు తేల్చాలని కోరారు. లేని పక్షంలో జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులతో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఆర్ జెసిపాల్, నాయకులు కే వెంకట్రావు, షేక్ పీరా సాహెబ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ప్రథమ స్థానం

- పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో జిల్లా ప్రథమ స్థానం
- బాలుర కన్నా బాలికలదే అత్యధిక స్థానం
- రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు జూలై 1లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో ప్రకాశం జిల్లా ప్రథమస్థానం సాధించింది. బుధవారం రాత్రి ఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో 96.15 శాతంతో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 1590 మంది బాలురు పరీక్షలు రాయగా 1527 మంది(96.04 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 1134 మంది బాలికలు పరీక్షలు రాయగా 1092 మంది(96.30 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 2724 మందికిగాను 2619 మంది (96.15 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లుగా జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర తెలిపారు. రీకౌంటింగ్‌కు సబ్జక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు సబ్జక్టుకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని, ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు స్వీకరిస్తారన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల హెచ్ఎంను సంప్రదించాలన్నారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు జూలై 1వ తేదీ రాత్రి 11 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

మద్దతు అరకొరే

- 14 రకాల పంటలకు మద్దతు ధర స్వల్పంగా పెంచిన కేంద్రం
- వరికి రూ.117 మాత్రమే పెంపు
- పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా పెంచలేదంటున్న రైతులు
- పునః సమీక్ష చేయాలంటున్న రైతు సంఘాల నేతలు
- జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యం 1,66,755 హెక్టార్లు
- ఒడిశాలో కేంద్ర ప్రభుత్వ ధర కంటే రాష్ట్రం అదనంగా చెల్లింపు
- మన రాష్ట్రంలో కూడా అదనపు ధర చెల్లించాలని కోరుతున్న రైతులు

పంటల సాగుకు ఏటా పెరుగుతున్న పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నామమాత్రపు మద్దతు ధరల పెంపుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధరలు సవరించలేదంటూ రైతులు, రైతు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తాళ్లూరు మండలం మాధవరం పొలాల్లో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

ఒంగోలు సెంట్రల్:

ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంలో ఏడాదికేడాదికి పెట్టుబడి వ్యయం పెరుగుతుంది. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు సవరించాల్సి ఉంది. మద్దతు ధర లేకపోతే దళారులు చెప్పిందే ధర అయ్యే ప్రమాదం ఉంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు కష్టించి పండించిన పంటలను దళారీలు కొల్లగొడతారు. రైతులు దళారీల బారినపడి నష్టపోరాదనే ఉద్దేశంతో కేంద్రం ఏటా పెట్టుబడి వ్యయాన్ని పరిగణలోనికి తీసుకుని మద్దతు ధర ప్రకటిస్తోంది. 2024–25 సంవత్సరానికి పండించే పంటలకు కేంద్రం మద్దతు ధరలు సవరించింది. వివిధ పంటలకు ఉన్న కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ (సాగు ఖర్చు)తో పోల్చుకుంటే కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు అసంతృప్తిని మిగిల్చాయి.

జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, కంది, మినుము, శనగ, సజ్జ, జొన్న సాగు చేస్తారు. ఏ పంటకు చూసినా సాగు ఖర్చు భారీగా ఉంది. వ్యవసాయ యంత్రాంగం పంటల వారీగా సాగు ఖర్చు లెక్కించి హెక్టార్‌కు ఎంత ఖర్చు వస్తుంది... దిగుబడి ఎంత.. ఒక క్వింటా ఉత్పత్తికి అయ్యే ఖర్చు ఎంత అనే వివరాలను శాస్త్రీయంగా లెక్కించి పంపుతుంది. కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ పరిగణలోనికి తీసుకుని మద్దతు ధరలు ప్రకటిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది. అయితే ఆ దిశగా కేంద్రం ఆలోచించకపోవటం గమనార్హం.

మద్దతు అంతంతే ...

జిల్లాలో వరి ప్రధాన ఆహారపు పంట. సాగర్ ఆయకట్టులో 2,54,992 ఎకరాల మాగాణి ఉంది. గత ఏడాది సాగర్ జలాలు రానందున బోరు, ఇతర జల వనరుల కింద 6,832 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈ పంట పెట్టుబడి వ్యయం ఏడాదికేడాదికి పెరుగుతోంది. కానీ మద్దతు ధరను రూ.117 మాత్రమే పెంచటంతో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. కనీస మద్దతు ధర రూ.2,500 పైన పెంచి ఉంటే ధాన్యం రైతుకు కొంత మేర న్యాయం జరిగేదనే వాదన వినిపిస్తోంది. మిగిలిన పంటల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది.

పెట్టుబడి వ్యయం ఇలా...

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం వరికి కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ హెక్టారుకు రూ.1,07,896 ఉంది. జొన్నకు రూ.67,281, పత్తికి రూ.82,823, కందికి రూ.56,075, పెసర రూ. 70,016, మినుముకు రూ.70,016, సజ్జలో రూ.33,784, మొక్కజొన్న రూ.57,949, పొద్దుతిరుగుడు రూ.55,500, కొర్ర రూ.27,313 ప్రకారం పెట్టుబడి వ్యయం ఉంటోంది. నిజానికి అన్ని పంటలపై ఇంకా పెట్టుబడి వ్యయం భారీగానే ఉంటుంది. వరిలో క్వింటా ధాన్యం పండించటానికి రూ.1962 ఖర్చు వస్తుంది. కేంద్రం మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2320, సాధారణ రకాలకు రూ.2,300 ప్రకటించింది. ప్రతి ఏటా రైతులు పండించిన ధాన్యానికి ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేనప్పుడు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో వరి ధాన్యం అమ్ముకుంటే హెక్టారుకు పండే క్వింటాళ్లకు రూ.1,27,600 వస్తుంది. పెట్టుబడి వ్యయం మినహాయిస్తే రైతుకు లభించే నికర ఆదాయం రూ.18,704 మాత్రమే.

క్వింటాలుకు సవరించిన మద్దతు ధరలు (రూ.)లలో

పంట	2023–24 మద్దతు ధరలు	2024–25 మద్దతు ధరలు	పెంపు రూ.
వరి గ్రేడ్ఏ	2203	2320	117
వరి (కామన్ రకం)	2183	2,300	117
పత్తి	7020	7521	501
మొక్కజొన్న	2030	2225	135
కందులు	7,000	7750	550
పెసలు	8558	8682	124
మినుములు	6950	7,400	450
వేరు శనగ	6377	6783	406
నువ్వులు	8635	9267	632
సజ్జ	2500	2615	115
రాగులు	3846	4290	444
పొద్దుతిరుగుడు	6760	7280	520
సోయాబీన్	4600	4892	292

జిల్లాలో ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం అధికారుల అంచనా...(హెక్టార్లలో) ఇలా..

పంటలు	నార్మల్ పంటలు	యాక్షన్ ప్లాన్ విస్తీర్ణం(హె)
వరి	14078	15100
జొన్న	194	240
సజ్జ	7125	7680
మొక్కజొన్న	2464	2464
రాగి	34	34
చిరుధాన్యాలు	1388	1600
ముతక ధాన్యాలు	11205	12018
కంది	73003	82154
పెసర	1061	1314
మినుము	2520	2549
ఉలవలు	8	8
ఇతర చిరుధాన్యాలు	117	259
వేరుశనగ	544	544
శనగ	2790	3058
ఆముదం	1723	1942
పొద్దుతిరుగుడు	161	180
సోయాబీన్	21	21
కాటన్	31562	33000
చెరకు	84	90
పొగాకు	0	2500
	1,50,082	1,66,755



చీమకుర్తి మండలం నాయుడుపాలెం వద్ద ఏపుగా పెరిగిన పత్తి

అమలుకు నోచుకోని స్వామినాథన్ సిఫార్సులు...

పంట ధరల్ని నిర్ణయించేందుకు ఏర్పాటు చేసిన స్వామినాథన్ కమిషన్ సూచించిన సిఫార్సులు నేటికీ అమలు చేయటం లేదు. వరి సాగుకు అయ్యే వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి ధర నిర్ణయించాలని స్వామినాథన్ సిఫార్సు చేశారు.

ఒడిశాలో క్వింటాల్ రూ.3,100

ఒడిశా రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ధర కంటే అదనపు ధర రూ.3,100 క్వింటాల్‌కు చెల్లిస్తుంది. ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా కనీస మద్దతు ధరపై అదనపు ధర చెల్లిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

మద్దతు ధర ఆందోళన కలిగిస్తోంది



పత్తి, కంది, వరి తదితర అన్ని పంటల్లో పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. పత్తిసాగులో హెక్టారుకు రూ.లక్ష వరకు పెట్టుబడి వ్యయం వస్తోంది. దిగుబడి 12–14 క్వింటాళ్లు మాత్రమే వస్తుంది. కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు మద్దతు ధర రూ.501 మాత్రమే పెంచి రూ.7020 చేసింది. మిగిలిన పంటల మద్దతు ధర నిరాశాజనకంగా ఉన్నాయి.

– శరత్, రైతు, కేవీపాలెం

మద్దతు ధరలు నిరాశాజనకం



కేంద్రం మద్దతు ధరలను మొక్కుబడిగా ప్రకటించినట్లు కనిపిస్తోంది. ఇలా అన్ని పంటల్లో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. అందుకు అనుగుణంగా మద్దతు ధరలు లేకపోవటం ఆందోళన కలిగించే విషయం. వరికి హెక్టారుకు పెట్టుబడి వ్యయం రూ.1.10 లక్షల వరకు ఉంటోంది. మద్దతు ధర కనీసం రూ.2,600 నుంచి రూ.3 వేల వరకు ఉండాలి. పత్తి వాణిజ్య పంటకు రూ.7,520 మాత్రమే నిర్ణయించటం ఎంత వరకు సమంజసం.

– మారెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు సంఘ ఉపాధ్యక్షుడు, ఒంగోలు.

కూటమి నేతలు కక్షసాధింపు మానండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

- ప్రజా సంక్షేమ పాలనపై దృష్టి పెట్టండి
- హామీలు అమలు కాకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆగడాలు
- నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఆగడాలు ఆపండి
- పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను నిర్వీర్యం చేశారు
- టీడీపీ పాలనపై మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఫైర్

సింగరాయకొండ: టీడీపీ, జనసేన కూటమి నేతలు వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్షసాధింపు చర్యలు మాని ప్రజా సంక్షేమ పాలనపై దృష్టిపెట్టాలని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ హితవు పలికారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి సురేష్ మాట్లాడారు. ఏంటీ అరాచకం.. ఏమిటీ విధ్వంసకర పాలన అని రాష్ట్ర ప్రజలంతా నిలదీసే పరిస్థితి వస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆగడాలకు తెగబడ్డారన్నారు. మేం దీని కోసమే అధికారంలోకి వచ్చామంటూ నాయకులు ఇచ్చిన ప్రోద్బలంతో కార్యకర్తలు రెచ్చిపోతున్నారన్నారు. ముఖ్యంగా కొండపి నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు వెలువెడిన తరువాత ఇప్పటి వరకు అనేక సంఘటనలు జరిగాయని వాటిని ఉదహరించటానికి మీ ముందుకు వచ్చానని సురేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశావంటూ అనేక మందిపై దౌర్జన్యం చేసిన ఘటనలు ఒక్కొక్కటిగా వివరిస్తానన్నారు.

☛ మర్రిపూడి మండలం గార్లపేట గ్రామానికి చెందిన దెందు నరశింహారావు బడ్డీకొట్టును టీడీపీ నాయకులు కేవలం సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశావన్న కారణంతో పెట్రోలు పోసి తగలబెట్టారని విమర్శించారు. ఆరోజు సుమారు రాత్రి 9 గంటల సమయంలో వచ్చి అతన్ని చంపుతామని బెదిరించి బడ్డీ కొట్టు తలగబెట్టారన్నారు. నీకు దిక్కున్న చోట చెప్పుకో అడ్డువస్తే చంపుతామని బెదిరించటంతో పాటు కర్రతీసుకుని దాడిచేశారన్నారు. ఈ విషయాన్ని ఎస్సైకి ఫిర్యాదు చేస్తే ఇంతవరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

☛ జూన్ మూడో వారంలో పొన్నలూరు మండలం తిమ్మపాలెం గ్రామానికి చెందిన మైనార్టీ వర్గీయులైన చొప్పర సుబ్బయ్య, ఆయన కోడలు ధనలక్ష్మి, కుమార్తె విజయమ్మ లను కేవలం వైఎస్సార్‌సీపీ గెలుపునకు సార్వత్రిక ఎన్నికల్లో పనిచేశారని సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించి చెప్పటానికి వీలులేని బూతులు తిడుతూ, బెదిరిస్తూ ఇష్టమొచ్చినట్లు కొట్టి.. చంపుతామని బెదిరించారన్నారు. ఈ విషయాన్ని ఎస్సైకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎటువంటి స్పందన లేదని అన్నారు.

☛ ఈనెల 11న కొండపి మండలం పెద్ద కండ్లగుంట గ్రామ సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ తన స్వంత పట్టా స్థలంలో రూ.5 లక్షలతో నిర్మించుకున్న కాంపౌండ్ వాల్ ను జేసీబీలు తీసుకొచ్చి సాయంత్రం 5 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు పోలీసుల సహాయంతో పూర్తిగా ధ్వంసం చేసి అనవాలు కూడా లేకుండా తొలగించి మారణహోమం సృష్టించారన్నారు. దీనిపై కొండపి ఎస్సైకి ఫిర్యాదు చేస్తే అక్కడేమీ జరగలేదని నేను వేరే విధుల్లో ఉన్నానని చెప్పారని, సీఐకు, డీఎస్పీకి ఫోన్ చేసినా స్పందన లేదన్నారు. 20 సంవత్సరాల క్రితం కట్టిన కాంపౌండ్‌వాల్ ఫౌండేషన్ కూడా తొలగించారని దీనిపై ఎవరికి చెప్పినా మీ సంగతి తేలుస్తాం, మీ అంతు చూస్తాం అని ఇది కేవలం టీజర్ మాత్రమేనని అసలు సినిమా ముందుందని భయ భ్రాంతులకు గురిచేసే పరిస్థితి ఉందన్నారు. దీనిపై కూడా ఫిర్యాదు చేశామని వివరించారు. ఒక సర్పంచ్‌కే ఈ పరిస్థితి ఉంటే మిగతా వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సర్పంచ్ ప్రాణాలకు భద్రత ఏదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులతో మాట్లాడితే ప్రస్తుతం టీడీపీ వారు ఆవేశంగా ఉన్నారు కొద్ది రోజుల్లో అన్ని సర్దుకుంటాయి. అప్పటి వరకు ఊరి వదిలి వెళ్లండని చెబుతున్నారని అన్నారు. వీరెవరూ స్పందించపోతే చివరికి న్యాయస్థానాల తలుపులు తడతామని సురేష్ తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే స్వామి మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తే ఈనెల 18వ తేదీ సదరు సర్పంచ్ భూములు అన్ని స్వాధీనం చేసుకోవాలని హడావిడిగా లెటర్ ప్యాడ్ తయారు చేసి మొట్టమొదటి లెటరు భూములు ఆక్రమించుకోవాలని ఆదేశించటాన్ని ఆయన దుయ్యబట్టారు.

☛ ఈనెల 13న టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెం గ్రామంలో సర్వే నంబరు 519–2 లో పీ వెంకట్రావుకు చెందిన 100 గజాల స్థలంలో నిర్మాణానికి తన అనుమతి అవసరం లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి చెప్పటంతో పనులు ప్రారంభించారన్నారు. తరువాత ఇది బ్యార్నీ, పొగాకు బోర్డు నుంచి అనుమతి లేదు అని పంచాయతీ కార్యదర్శి ప్రశ్నించారని.. అసలది తన పరిధి కాదన్నారు. ఈ కట్టడాన్ని కూల్చేస్తానని బెదిరించాడని సురేష్ ఆరోపించారు. వాస్తవానికి కాకుటూరిపాలెంలో టీడీపీ సానుభూతిపరులు ఎక్కువని, ఈ ఎన్నికల్లో వెంకట్రావు చురుగ్గా వైఎస్సార్‌సీపీకి పనిచేయడంతో గ్రామంలో టీడీపీకి మెజారిటీ తగ్గిందని ఇది ఓర్వలేని టీడీపీ వారు ఈ విధంగా పంచాయతీ కార్యదర్శిని అడ్డంపెట్టుకుని బ్యారన్ కూల్చేశారని విమర్శించారు. దీంతో వెంకట్రావు హైకోర్టును ఆశ్రయించాడని.. కోర్టు ఆరు వారాల సమయం ఇవ్వాలని, అప్పటి వరకు కూల్చవద్దని ఆదేశాలిచ్చిందన్నారు. ఈనెల 13వ తేదీ ఆర్డరు ఇస్తే రెండు వారాలు ఆగి ఈనెల 25వ తేదీ మీకు అనుమతి ఇవ్వడం లేదు తొలగించాలని చెప్పి ఉదయం 11 గంటలకు ఆర్డరు ఇచ్చి మధ్యాహ్నం 2 గంటల నుంచి జేసీబీతో కూల్చారని వాస్తవానికి ఆర్డర్ ఇచ్చిన 36 గంటల వరకు సమయం ఇవ్వాల ని అప్పుడు పెనాల్టీ కడతామని తెలిపారు. కానీ పోలీస్ వ్యవస్థ సహకరించడం లేదని దుయ్యబట్టారు. వెంకట్రావును కలిసి ధైర్యం చెబుతామని కాకుటూరిపాలెం వెళితే అక్కడ సీఆర్‌పీఎఫ్ బలగాలను దించి 144 సెక్షన్ విధించారని విమర్శించారు.

☛ ఇటీవల కొండపి మండలం పెట్లూరు గ్రామంలో 4.40 ఎకరాల పట్టాభూమికి వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడికి పట్టాలు ఉంటే టీడీపీ నాయకులు ఆ భూమిలో ఎస్సీలను ఉరిగొల్పి గుడిసెలు వేయించారని ఆరోపించారు. దీనిపై సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకెళ్తే సమస్యను పరిష్కరించాలని తహశీల్దార్‌కు చెప్పాడని.. ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదని సురేష్ ఆరోపించారు.

☛ ఊళ్లపాలెం గ్రామంలో పాకనాటి రమణారెడ్డిని టీడీపీ సానుభూతిపరుడు రాళ్లతో దాడి చేసి గాయపరిచారన్నారు. ఇటువంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ఈ ఘటనలను ప్రతిఘటిస్తామన్నారు.

ఇసుక దోపిడీపై నోరు మెదపరేం?

- ఎన్నికల ఫలితాలొచ్చిన రోజు నుంచే టీడీపీ నేతల ఇసుక దందా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇసుక పాలసీపై గగ్గోలు పెట్టిన టీడీపీ నాయకులు.. నేడు రాత్రింబవళ్లు తేడా లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జరుగుమల్లి మండలం చతుకుపాడు, చింతలపాలెం, జరుగుమల్లి, కె.బిట్రగుంట రీచ్‌ల్లో ఇసుక అక్రమ రవాణాపై మంత్రి ఘాటుగా స్పందించారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజు రాత్రి నుంచే వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తూ టీడీపీ నాయకులు లక్షలాది రూపాయలు దోచేస్తున్నారని దుయ్యబట్టారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన సెబ్, మైనింగ్, పోలీసు అధికారులు ఎటు పోయారని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా వ్యవస్థలు బాగు చేయాలని ఉపన్యాసాలిచ్చిన చంద్రబాబు ఇసుక దందాపై నోరు మెదపాలని డిమాండ్ చేశారు. మంత్రి స్వామి నేతృత్వం వహిస్తున్న నియోజకవర్గంలో టీడీపీ నేతల ఇసుక దందాను ఆధారాలతో సహా నిరూపిస్తామని పేర్కొన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. టీడీపీ నేతలకు సంపద దోచిపెడుతున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, యన్నాబత్తిన కార్తీక్, సోమిశెట్టి సురేష్, చుక్కా కిరణ్‌కుమార్, పిన్నిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఉత్తీర్ణత స్వల్పమే

- ఇంటర్ సప్లిమెంటరీ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో నామమాత్రంగా ఉత్తీర్ణత
- జనరల్ విభాగంలో 42 శాతంతో 13వ స్థానం
- ఒకేషనల్‌లో 49 శాతంతో 18వ స్థానం

ఒంగోలు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లోను జిల్లాలో ఉత్తీర్ణత స్వల్పంగానే ఉంది. బుధవారం సాయంత్రం ఈ ఫలితాలను ఇంటర్మీడియెట్ విద్యాశాఖ విడుదల చేసింది. మన జిల్లాలో జనరల్ విభాగంలో 3446 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 1342 మంది (39శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. బాలికల విభాగంలో 2999 మందికిగాను 1367 మంది (46శాతం) ఉత్తీర్ణత సాధించి బాలురకంటే మెరుగైన ఫలితాలు కనబరిచారు. జనరల్ విభాగంలో 6445 మందికిగాను 2709 మంది (42శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 419 మంది బాలురకుగాను 184 మంది (44శాతం), బాలికల విభాగంలో 3434 మందికిగాను 188 మంది (56శాతం) పాసయ్యారు. మొత్తంగా ఒకేషనల్ విభాగంలో 753 మందికిగాను 372 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

జనరల్ విభాగంలో 13వ స్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా ఒకేషనల్ విభాగంలో మాత్రం 18వ స్థానంలో నిలిచింది. జనరల్ విభాగంలో తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కొండపి, దూపాడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలు, త్రిపురాంతకం, కొమరోలు, కె.బిట్రగుంట, అర్ధవీడు, దొనకొండ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నాయి. ఏపీ మోడల్ స్కూల్ దోర్నాల 97.56 శాతం ఉత్తీర్ణత సాధించింది. యాజమాన్యాల వారీగా పరిశీలిస్తే ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 56.23 శాతం, ఏపీ మోడల్ స్కూల్స్ 40.67 శాతం, హైస్కూలు ప్లస్ 60.46 శాతం, కేజీబీవీ 66.80 శాతం, ఏపీ సోషల్ వెల్ఫేర్/ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలు 58.25 శాతం, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు 54.55 శాతం ఉత్తీరత నమోదు చేసుకున్నాయి. కానీ ప్రైవేటు జూనియర్ కాలేజీలు మాత్రం 37.43 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. ఒకేషనల్ విభాగంలో కురిచేడు కేజీబీవీ వందశాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. ప్రభుత్వ కాలేజీలు 47.13 శాతం, కేజీబీవీలు 50 శాతం, ప్రైవేటు 45.90 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

క్లుప్తంగా

తాళాలు పగలగొట్టి ఇంట్లో చోరీ

మార్కాపురం: తాళాలు పగలగొట్టి ఇంట్లో చోరీ చేసిన సంఘటన బుధవారం మార్కాపురం పట్టణంలోని అల్లూరి పోలేరమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం మేరకు.. అల్లూరి పోలేరమ్మ గుడి వద్ద ముల్లా మహమ్మద్ నివాసముంటున్నారు. గురువారం ఉదయం బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్తూ ఇంటికి తాళం వేసి వెళ్లారు. మధ్యాహ్నం వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న 5 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు జతల వెండి పట్టీలు పోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా చోరీ జరిగిన ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

మార్కాపురం: హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష, 1000 రూపాయల జరిమానా విధిస్తూ మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శుభవాణి బుధవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలూనాయక్ తెలిపారు. వివరాలు.. అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామానికి చెందిన ఆలమూరి సుబ్బమ్మ నాయనమ్మ 2017 ఫిబ్రవరి 27న చనిపోగా ఆమె అదే ఏడాది మార్చి 10న బంధువులతో కలిసి సాంబ్రాణి వేసుకునేందుకు భర్త ఆలమూరి వెంకటేశ్వర్లు, బంధువులతో కలిసి వెళ్తోంది. ఇదే సమయంలో గ్రామానికి చెందిన పోలేపల్లి శ్రీనివాసులు మద్యం తాగేందుకు ఆలమూరి వెంకటేశ్వర్లును డబ్బు అడగ్గా ఇవ్వక పోవడంతో కత్తితో పొట్టలో పొడిచాడు. దీంతో వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందడంతో భార్య ఆలమూరి సుబ్బమ్మ ఫిర్యాదు చేసింది. అప్పటి అర్ధవీడు ఎస్సై(ప్రస్తుతం పొదిలి) జి.కోటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్షతో పాటు 1000 రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలూనాయక్ వాదించారు.

విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ఒంగోలు: పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష సంయుక్తంగా 1 నుంచి 8వ తరగతి వరకు 100 శాతం ఎన్‌రోల్‌మెంట్ సాధించేందుకు చేపట్టిన విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని డీఈఓ డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ఈనెల 27వ తేదీలోగా, ప్రధానోపాధ్యాయులు ఈ నెల 30వ తేదీ లోగా దీక్ష యాప్‌లో తప్పనిసరిగా లాగిన్ అయి వారి ప్రొఫైల్ అప్డేట్ చేసుకున్న తరువాత విద్యాప్రవేశం కార్యక్రమానికి సంబంధించిన కృత్యాలు, రోజువారీ నమోదు వివరాలు, ఫొటోలు, వీడియోలు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు.

ట్రైమోపెడ్లకు పెట్రోల్ సబ్సిడీ

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో స్వయం ఉపాధి, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ రెట్రో ఫిట్టింగ్ మూడు చక్రాల వాహనాలు కలిగి ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వం పెట్రోలు సబ్సిడీ అందిస్తోందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జి.అర్చన తెలిపారు. అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులు దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి దరఖాస్తు పొంది పూర్తి చేసి జూలై 5వ తేదీలోగా కార్యాలయంలో అందించాలని కోరారు. వివరాలకు కార్యాలయ పని వేళల్లో 08592 281310ను సంప్రదించాలని సూచించారు.

పొగాకు 'అధర'హో

- గరిష్ట ధర రూ.362
- ఆర్ఎం లక్ష్మణరావు వెల్లడి


పొదిలి వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు

ఒంగోలు సెంట్రల్: రీజియన్ పరిధిలో పొగాకు ధరలు బుధవారం పొగాకు ధరలు అదరగొట్టాయి. గరిష్టంగా రూ. 362 ధర పలికింది. మే 31న జరిగిన వేలంలో అత్యధికంగా కొనుగోలుదారులు రూ. 360కు కొనుగోలు చేయగా మళ్లీ బుధవారం రూ.362 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో బుధవారం 8118 బేళ్లు రాగా 7494 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేయగా 624 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. అందులో ఫిబ్రవరి 29న మొదలైన ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 90వ రోజు వేలంపాట జరుగుతున్నట్లు చెప్పారు. అందులో 5247 బేళ్లు రాగా 4993 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేయగా 354 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. అందులో కేజీ గరిష్టంగా రూ. 362 కాగా, కనిష్టంగా 205, సరాసరి రూ. 265.70 వచ్చినట్లు చెప్పారు. మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కలిగిరి, కందుకూరు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 85వ రోజు వేలంపాటలు జరుగుతున్నాయి. ఆయా కేంద్రాల్లో 2871 బేళ్లు రాగా 2601 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేయగా 270 బేళ్లను తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.360, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.228.96 పలికింది.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు నాశనమే


ర్యాలీ ప్రారంభిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు


ఆర్టీసీ బస్టాండు చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసిన దృశ్యం

ఒంగోలు టౌన్: మాదక ద్రవ్యాల బారిన పడితే జీవితాలు నాశనం అవుతాయని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో కలిసి నగరంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. కర్నూలు రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని స్థాపించేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ... విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన కొందరు యువకులు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షణకాలం సంతోషం కోసం నూరేళ్ల జీవితాన్ని నాశనం చేసుకోవడం అవివేకమన్నారు. మంచి అలవాట్లు చేసుకోవాలని, బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని చెప్పారు. ఎవరైనా మాదక ద్రవ్యాలను సరఫరా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమాచారం ఉంటే 9121102266కు ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సెబ్ ఈఎస్ రవి కుమార్, ఒంగోలు డీఎస్పీ కిశోర్ బాబు, టూ టౌన్ సీఐ జగదీష్, సెబ్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐలు సీతారామి రెడ్డి, రమేష్ కృష్ణన్, రమణారెడ్డి, ఎస్ఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై బైక్ దొంగతనాలు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్


స్వాధీనం చేసుకున్న బైక్‌లు

- ముగ్గురు నిందితుల అరెస్టు
- 21 మోటార్‌బైక్‌ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): వ్యసనాలకు బానిసైన ముగ్గురు యువకులు మోటార్‌బైక్‌లను దొంగలించి పోలీసుల కళ్లుగప్పి తిరగసాగారు. వారి కదలికలపై నిఘా ఉంచిన సీసీఎస్, కావలి పోలీసుల ప్రత్యేక బృందం కావలి తుమ్మలపెంట రోడ్డు వద్ద బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ నిందితుల వివరాలను వెల్లడించారు. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చెందిన పి.భానుప్రకాష్, జి.గోప్స్, జి.హనుమాన్‌లు స్నేహితులు. వీరు చిన్నతనం నుంచే చెడువ్యసనాలు, జల్సాలకు బానిసయ్యారు. అవసరాలను తీర్చుకునేందుకు రెండు సంవత్సరాలుగా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో బైక్‌లను దొంగతనం చేసి వాటిని అమ్మి సొమ్ము చేసుకుని జల్సాగా జీవించసాగారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, కె.సాంబశివరావు, కావలి ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజేష్ తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. సాంకేతికత ఆధారంగా బుధవారం నిందితులు కావలి పట్టణం తుమ్మలపెంట రోడ్డు వద్ద ఉండగా ప్రత్యేక బృందం నిందితులను అదుపులోకి తీసుకుని కావలి ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కావలి ఒకటో పట్టణం, కావలి రూరల్, చీరాల ఒకటో పట్టణం, ఒంగోలు రూరల్, కనిగిరి పోలీసు స్టేషన్ల పరిధిలో రూ.15 లక్షల విలువ చేసే 21 బైక్‌లను దొంగతనం చేసినట్లు నిందితులు విచారణలో వెల్లడించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి దొంగతనం చేసిన బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి లక్షల రూపాయల విలువ చేసే బైక్‌లను స్వాధీనం చేసుకునేందుకు కృషి చేసిన సీసీఎస్, కావలి డీఎస్పీలు పి.రామకృష్ణాచారి, ఎం.వెంకటరమణ, సీసీఎస్, కావలి ఇన్‌స్పెక్టర్లు, కావలి ఎస్సై రాజేష్, సీసీఎస్ సిబ్బంది రావు గిరిధర్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, శ్రీనివాసులు, కరిముల్లా, సాయి ఆనంద్, నిరంజన్, విజయ్, శివకృష్ణ, సురేష్, కావలి సిబ్బంది షఫీఉల్లాఖాన్, రవీంద్ర, అశోక్‌కుమార్ తదితరులను ఎస్పీ అభినందించి అభినందనపత్రాలను అందజేశారు. సమావేశంలో క్రైమ్ ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

- ఈనెల 28లోపు పేరు నమోదు చేసుకోవాలని సంఘ అధ్యక్షుడు పిలుపు

ఒంగోలు సెంట్రల్: గౌడ విద్యార్థులకు జిల్లా గౌడ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు పంపిణీ చేయనున్నట్లు సంఘ అధ్యక్షుడు తాత వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 2023-24లో పదవ తరగతిలో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులు ఈనెల 28వ తేదీ లోపు సంఘ అధ్యక్షుడు తాత వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రెసిడెంట్ కీర్తి వెంకట గురవయ్యకు వివరాలు పంపాలని కోరారు. విద్యార్థులకు ఈనెల 30న ఆదివారం బాలాజీరావుపేటలోని లావు గంగాధరరావు భవనంలో గాంధీ పార్క్ వద్ద ప్రతిభ అవార్డులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఫోన్ 9948160110, 6281658858కు విద్యార్థి మార్కుల మెమో, క్యాస్ట్ సర్టిఫికెట్ పంపించాలని వివరించారు.

డీసీఈబీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

ఒంగోలు: జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) కార్యదర్శిగా మర్రిబోయిన శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు డీసీఈబీ కార్యదర్శిగా పనిచేస్తున్న పొదిలి మండలం ఉప్పలపాడు హెడ్మాస్టర్ వై.వెంకట్రావు స్థానంలో ఈయన బాధ్యతలు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ నేత ఆర్వో ప్లాంటుకు తాళం

టంగుటూరు: వైఎస్సార్ సీపీ నాయకుడికి చెందిన మంచి నీటి ప్లాంటుకు పంచాయతీ కార్యదర్శి బుధవారం తాళం వేశారు. టంగుటూరు గ్రామంలోని పోతుల చెంచయ్య కాలనీకి పంచాయతీ అనుమతితో ఐటీసీ కంపెనీ, కాలనీ ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును మూత వేయడాన్ని టంగుటూరు మాజీ సర్పంచ్, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, పంచాయతీ వార్డు మెంబర్ పుట్టా సుశీలతోపాటు కాలనీ వాసులు తీవ్రంగా ఖండించారు. మంత్రి డీబీవీ స్వామి ఆదేశాలతోనే ప్లాంటుకు తాళం వేశారని ఆరోపించారు. బలహీన వర్గాల ప్రజలు నివాసం ఉండే పోతుల చెంచయ్య కాలనీని అభివృద్ధి చేయాల్సింది పోయి, స్థానిక టీడీపీ నాయకుల మాటలు విని వాటర్ ప్లాంటుకు తాళం వేయించడం ఏమిటని ప్రశ్నించారు. అభివృద్ధి నిరోధకులుగా మారవద్దని మంత్రికి హితవు పలికారు.


టంగుటూరు పోతుల చెంచయ్య కాలనీలో తాళం వేసిన వాటర్ ప్లాంట్

సత్తా చాటిన గుంటూరు ఎడ్లు

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన గొడ్రాలికొండ బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలు జరుగుతున్నాయి. రెండో రోజు బుధవారం సీనియర్ విభాగంలో పోటీలు ముగిశాయి. పోటీల్లో గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం కోపురావురు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్ల జత 2400 అడుగులు లాగి మొదటిస్థానం, అదే యజమాని ఎడ్లు 1642 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గుంపరుమనుదిన్నె గ్రామానికి చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి ఎడ్లజత 2203 అడుగులు లాగి రెండోస్థానంలో, పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన కటికల యస్వంత్ ఎడ్లజత 1614 అడుగులు లాగి నాల్గవ స్థానంలో నిలిచాయి. రాచర్ల మండలం జేపీచెరువు గ్రామానికి చెందిన బొర్ర రవితేజ ఎడ్ల జత 1077 అడుగులు లాగి ఐదోస్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.70 వేలు ఏర్వ రామాంజనేయరెడ్డి, రెండో బహుమతి రూ.50 వేలు వెన్నా వెంకటరెడ్డి, దుగ్గెంపుడి చిన్నకొండారెడ్డి, మూడో బహుమతి రూ.30 వేలు దుగ్గెంపుడి సత్యనారాయణరెడ్డి, నాల్గవ బహుమతి రూ.20 వేలు ముడమంచు గురునాథం, బుక్కసముద్రం చిన్నయల్లమందారెడ్డి, ఐదో బహుమతి రూ.10 వేలు కోలగొట్ల సుబ్బారెడ్డి గెలుపొందిన ఎడ్ల యజమానులకు అందజేశారు. న్యాయనిర్ణేతలు వెన్నా బోడిరెడ్డి, బిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తిరుమలరెడ్డి సుధాకరరెడ్డి, కుందురు ప్రసాదరెడ్డి, గోదాపు సత్యనారాయణరెడ్డి, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, యాంకర్ వల్లెల వెంకటరామిరెడ్డి వ్యవహరించారు. ఎడ్ల పోటీలను తిలకించేందుకు రైతులు, ప్రజలు, మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.


బండ లాగుతున్న ఎడ్లు

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులా?

- బలవంతపు తొలగింపులు ఆపాలని సీపీఎం డిమాండ్
- ఉపాధి హామీ పథకం పనులను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ఒంగోలు టౌన్: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, స్కూల్ స్వీపర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను, వీఏఓలను తొలగించేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇవి రాజకీయ నియామకాలు కావని, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీ నుంచి ఉపాధి హామీ పనులు ఆగిపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ఉపాధి పనులను పునరుద్ధరించి గ్రామీణ ప్రాంత కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని 22 మండలాల్లో 29,713 హెక్టార్ల పంట నష్టం జరిగిందని, 36,147 మంది రైతులను ఆదుకునేందుకు తక్షణ సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాలనా సౌలభ్యం కోసం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలని, దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి వలసలు ఆపాలని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, భూమిలేని వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు ఒక్కొక్కరికి 3 ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని, జిల్లాలో 729 గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని, రిమ్స్‌లో స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభించాలని, మార్కాపురం మెడికల్ కళాశాలను వేగవంతంగా పూర్తి చేయాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా తిరుమలనాథస్వామి రథోత్సవం


రథం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు


తిరుమలనాథస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలోని గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి రథోత్సవం బుధవారం కనులపండువగా సాగింది. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. రథాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఉభయదాతలు స్వామికి పట్టువస్త్రాలు, పూజ సామగ్రిని ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. రథం ముందు కుంభం పోసి గుమ్మడికాయతో అర్చకులు దిష్టి తీశారు. సాయంత్రం ఉభయ దేవేరులతో కలిసి తిరుమలనాథ స్వామి రథంపై కొలువుతీరారు. ఆలయ ప్రాంగణంలో రథోత్సవం భక్త జనసందోహం నడుమ వైభవంగా విహరించగా, స్వామి నామస్మరణతో భక్తులు పులకించిపోయారు. ఊరేగింపు అనంతరం స్వామి అమ్మవార్లను రథం నుంచి కిందకు దించి ఊరేగింపుగా తిరుమలనాథునిస్వామి ఆలయానికి చేర్చారు. సాయంత్రం బాలికలు కోలాటం ఆసక్తిగా మహిళలు తిలకించారు. భక్తుల కోసం అన్ని కులాల సత్రాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై వెంకటసైదులు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

- ఆరుగురు నిందితులు అరెస్టు


మాట్లాడుతున్న సెబ్ ఎస్ఈ రవి కుమార్, సిఐ సూర్యనారాయణ.

ఒంగోలు టౌన్: పొరుగు రాష్ట్రం ఒడిశా నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న ముఠాను సెబ్ అధికారులు అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని సెబ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సెబ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన దీపక్ కుమార్ మాలిక్ చీమకుర్తి మండలంలోని మర్రిచెట్లపాలెంలో నివసిస్తుంటాడు. తరచూ ఒడిశా వెళ్లి అక్కడ నుంచి తక్కువ ధరకు గంజాయి తెచ్చి ఇక్కడ విక్రయిస్తుంటాడు. గత నెలలో దీపక్ పెదనాన్న మరణించడంతో భార్య ఎస్తేరమ్మతో కలిసి ఒడిశా వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఎప్పటిలాగే గంజాయి కొని తెచ్చుకున్నాడు. అయితే ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు అధికంగా ఉండటంతో గంజాయిని విక్రయించలేకపోయాడు. అప్పటి నుంచి ఇంట్లోనే దాచి ఉంచిన గంజాయిని విక్రయించేందుకు చిన్న చిన్న పొట్లాలుగా మార్చాడు. మర్రిచెట్లపాలెంలోని గ్రానైట్ కార్మికులకు విక్రయించేందుకు వస్తుండగా దీపక్ కుమార్ మాలిక్‌ను చీమకుర్తి సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి భార్య ఎస్తేరమ్మ, బంధువులు నాగులూరి కోటయ్య, గురునాథం ఎలిషా, గురునాథం నామోషి, ఆనందరావును అరెస్టు చేసి వారి నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సెబ్ సీఐ జి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

పదవుల కోసం తెలుగు తమ్ముళ్ల గలాట

- రసాభాసగా పెద్దారవీడు టీడీపీ సమావేశం


వాదులాడుకుంటున్న టీడీపీ నేతలు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి 20 రోజులు కాకముందే టీడీపీ నేతలు పదవుల కోసం గొడవలు పడుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీలో విభేదాలు బయటపడ్డాయి. బుధవారం మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పెద్దారవీడు మండల టీడీపీ శ్రేణుల సమావేశం నిర్వహించారు. గుండంచర్లకు చెందిన పలువురు నాయకులు పదవుల విషయమై తీవ్ర స్థాయిలో గొడవపడ్డారు. గలాటా బయటకు వినిపించడంతో రోడ్డున వెళ్లేవారు సైతం లోపలికి వెళ్లి చూశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ గొడవ తతంగాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఉన్న రేషన్ షాపు డీలర్లు, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు, ట్రాక్టర్లతో నీళ్ల తోలడం, ఫీల్డు అసిస్టెంట్ల నియామకం, డ్వాక్రా సంఘాల్లోని వీఏఓలు తదితర పదవుల కోసం పట్టుబట్టారు. ఈ విషయమై బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల గ్రామ టీడీపీ నేతలు, కార్యకర్తలు తమకు కావాలంటే తమకే కావాలంటూ తీవ్ర స్థాయిలో వాగ్వివాదానికి దిగారు. తెలుగు తమ్ముళ్ల తీరు చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గొడవ విషయం తెలిసి అక్కడికి చేరుకున్న విలేకర్లను లోపలికి అనుమతించలేదు. మొత్తంమీద పెద్దారవీడు మండల టీడీపీ నేతల గలాటా మార్కాపురంలో చర్చనీయాంశమైంది.

పామూరులో భారీ చోరీ

- 40 గ్రాముల బంగారు ఆభరణాలు, కేజీ వెండి వస్తువులు, రూ.95 వేల నగదు అపహరణ

పామూరు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన పామూరులోని 565వ జాతీయ రహదారి పక్కన జరిగింది. వివరాల్లోకి వెళితే.. షేక్.రంజాన్‌బీ అనే మహిళ గత మూడేళ్లుగా తూర్పువీధి బీసీ బాలుర వసతి గృహం దగ్గర 565వ జాతీయ రహదారి పక్కన సొంత ఇంట్లో నివాసం ఉంటుండగా ఆమె భర్త బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. రంజాన్‌బీ గర్భిణి. ఆమె ఈనెల 24న కనిగిరి మండలం గురువాజీపేటలోని పుట్టింటికి వెళ్లింది. 26వ తేదీ ఉదయం 7 గంటల సమయంలో రంజాన్‌బీ మామ షేక్.పెదఖాసీం ఇంటి వద్దకు వెళ్లి చూడగా మెయిన్‌డోర్, కిటికీ అద్దం పగులగొట్టి ఉంది. 40 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.130 కేజీల వెండి, రూ.95 వేల నగదు చోరీ అయినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ముల్లా మహ్మద్ తెలిపారు.